క్లుప్తంగా

బాస్కెట్‌బాల్‌లో విద్యార్థులకు శిక్షణ



నూజివీడు: పట్టణంలోని విక్టోరియా పురమందిరం ఆవరణలోని గ్రౌండ్ నందు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి ఉచిత క్రీడా శిబిరం ముమ్మరంగా కొనసాగుతోంది. వేసవిలో విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇక్కడ బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. 200 మంది విద్యార్థులు ఇక్కడకు వచ్చి వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. కోచ్‌లుగా ఎస్ లక్ష్మి, వీ వనజ, వాకా నాగరాజు, డీ సతీష్‌కుమార్, వీ శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోచ్ వాకా నాగరాజు కోరారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

ముసునూరు: ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై లైంగిక దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని కొర్లగుంట శివారు సింహాద్రి అప్పారావుపేటకు చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన రామకూరి అశోక్ (55) బుధవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో అత్యాచార యత్నం చేశాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో గొంతు పట్టుకుని, అరిస్తే చంపేస్తానంటూ, బెదిరించాడు. ఈలోగా ఆమె కేకలు విన్న చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకునేసరికి, తెల్లారేలోగా చంపేస్తానని బెదిరించి పారిపోయాడు. దీనిపై బాధిత మహిళ శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఎల్‌ఎస్‌తో గుండెపోటు నివారణ



తిరువూరు: బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రక్రియతో గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని క్రిటికల్ కేర్ వైద్యనిపుణులు ధరణేంద్ర సూచించారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వారు ఆస్పత్రికి వచ్చేలోపు సీపీఆర్ ఇస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం, తోలుకోడు, చంద్రాల, పుల్లూరు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షం, గాలిదుమ్ములతో కొన్ని ఏరియాల్లో చెట్లు రహదారులపై కూలిపోయాయి. మరికొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడి తెగిపోయాయి. దీంతో ఆయా పంచాయతీల కార్యదర్శులు అంతర్గత రహదారులను శుభ్రం చేయించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌లైన్లు సరిచేయడంలో నిమగ్నమయ్యారు.

బీమా నగదు అందజేత

ఆగిరిపల్లి: మండలంలోని చిన్న ఆగిరిపల్లి పంచాయతీ శివారు సింగన్నగూడెంకు చెందిన కానూర్ల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదు శనివారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, సర్పంచ్ పల్లగాని రమాదేవి జమదగ్ని, నాయకులు చిన్న రాంబాబు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగ శైలజ

నూజివీడు: రాజీమార్గమే రాజమార్గమని, పంతాలకు, పట్టింపులకు పోకుండా రాజీపడి లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వర పరిష్కారం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులకు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి ఎంతో విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోకుండా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ఇరువైపులా ఉన్న కక్షిదారులకు ఎంతో మేలని అన్నారు. ప్రతిఒక్కరూ లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌ఎల్ శ్రీనివాసరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే హరిబాబు, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్, రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు, రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ పాల్గొన్నారు.

1,033 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌లో 1,033 కేసులను పరిష్కరించారు. ఎంవీటీపీ కేసులకు సంబంధించి రూ.30.40లక్షల నష్టపరిహారాన్ని అందజేసినట్టు తెలిపారు.

అవకాశం ఉన్నంత వరకు కేసులు రాజీ చేసుకోవాలి

మైలవరం: కక్షిదారులు రాజీ పడేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బౌన్స్ చెక్కు కేసులు రాజీ చేసుకుని తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎం. శైలజ తెలిపారు. మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌కు అనుబంధంగా మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. లోక్ అదాలత్‌లో 296 కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి శైలజ తెలిపారు. ముందుగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి న్యాయవాదులతో చర్చించారు. సమావేశంలో మైలవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుద్దవరపు వెంకట్రావు, న్యాయవాదులు ఏడీ ప్రసాద్, ఎం. రవికుమార్, ఆర్.రమేష్‌బాబు, ఎం. శరత్‌బాబు, పీ రాము, తనూజ, ఏపీపీ హమీద్ పాల్గొన్నారు. క్రిమినల్, అడ్మిషన్ మనోవర్తి తదితర కేసులు పరిష్కారమయ్యాయి.



తిరువూరు కోర్టులో లోక్ అదాలత్

లోక్ అదాలత్‌లు సద్వినియోగం చేసుకోండి

తిరువూరు: రాజీ చేసుకోదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే మోతీలాల్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. చిన్న తగాదాలకు పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకోవాలని కక్షిదారులను కోరారు. బార్ అసోసియేషన్ చైర్మన్ సంకురాత్రి జనార్దనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి మోతీలాల్ 600 కేసులను పరిష్కరించారు. సభ్యులు రేగళ్ల మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్రహాం పాల్గొన్నారు.

ఉపాధి పథకానికి తూట్లు

చాట్రాయి: ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. మండలంలోని చిన్నంపేటలో ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించి, మాట్లాడారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు బడ్జెట్‌లో భారీ కోత విధించినట్లు చెప్పారు. 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆనందం, గంగరాజు, మోహన్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



చెన్నవరంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

చెన్నవరం(గంపలగూడెం): రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కె. రక్షణనిధి పేర్కొన్నారు. గంపలగూడెం మండలం చింతలనర్వ సచివాయం పరిధిలోని చెన్నవరంలో శనివారం ఆయన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ప్రజాసమస్యలను తెల్సుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను కులమత, రాజకీయాల జోలికి పోకుండా అర్హతే ప్రామాణికంగా అమలుపరుస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో కూడా దళారుల ప్రమేయం లేకుండా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితోనే ఎంపిక చేస్తున్నారన్నారు. గతంలో పింఛన్ కావలంటే జన్మభూమి కమిటీ సభ్యుల అనుమతి కావల్సి ఉందని, ఇప్పుడు ఆ పరిస్థితిని స్వస్తిపల్కారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామంలో 210 కుటుంబాలు ఉంటే వివిధ సంక్షేమ పథకాల ద్వారా 1,200 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.3.46 కోట్లను నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో వేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో మూడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరగా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శ్యామ్యూల్, సర్పంచ్ జాన్‌కోటయ్య, ఎంపీటీసీ సభ్యుడు జొన్నగడ్డ మేరీశాంతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నర్సారెడ్డి, చెన్నకేశవరెడ్డి, కృష్ణయ్య, నాయకులు వీరాస్వామి, పీ శివ, ప్రేమరాజ్, లక్ష్మీనారాయణ, రాంబాబు, వైకుంఠం పాల్గొన్నారు.

మేడూరు ఆలయంలో ముఖమండపం ప్రారంభం

రూ.6 లక్షల విరాళంతో మండప నిర్మాణం



ముఖమండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయ స్వామి ఆలయంలో దాతల విరాళంతో నూతనంగా నిర్మించిన ముఖమండపాన్ని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతల తమవంతు సహకారం అందజేయడం అభినందనీయమన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చెంతన పెరిగేలా ఆలయంలో కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ముందుగా అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు, ఆంజనేయాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయంలో ముఖమండ నిర్మాణానికి తెలంగాణా రాష్ట్రం మధిర మండలం రాయపట్టణానికి చెందిన దాత దూళిపాటి వీరయ్యబాబుచౌదరి, కృష్ణకుమారి దంపతలు రూ.4 లక్షలు, మరో కొందరు దాతలు కలిసి రూ.2లక్షలు విరాళం అందజేయగా వెరశి రూ.6లక్షలతో ముఖమండపాన్ని నిర్మించారు. ఈఓ జన్ను వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శ్యామ్యూల్, ఎంపీటీసీ సభ్యురాలు విజయనిర్మల, పాలకవర్గ సభ్యులు పార్వతి, రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయస్వామికి అభిషేకం



మేడూరు వీరాంజనేయస్వామికి అభిషేకం



తిరువూరు రాజుపేట ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు

మేడూరు(గంపలగూడెం): జిల్లాలో విశిష్ట ఆలయమైన గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు రెండో రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు ప్రారంభించారు. స్వామికి 108 కలశ బిందెల జలం, పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం కనులవిందుగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాన్ని తిలకించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి సహస్ర నామార్చన, 10 వేల తమలపాకులతో విశేష అర్చన చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలరామకృష్ణ, పాలకవర్గ సభ్యులు, ఈఓ జన్ను వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

మేడూరులో కోలాటం ప్రదర్శన

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న కోలాటం ప్రదర్శన పోటీలు రెండో రోజు శనివారం ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన ఆరు కోలాటం బృందాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి.

నేడు జైహనుమాన్ శోభాయాత్ర

గంపలగూడెం: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం వీరాంజనేయస్వామి భక్తబృందం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర పెద్ద ఎత్తున నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటలకు గంపలగూడెం రామాలయం వద్ద నుంచి జైహనుమాన్ శోభాయాత్ర ప్రారంభమౌతుంది. ఐదు కిలోమీటర్ల దూరం కొనసాగి మేడూరు వీరాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. బైక్‌లు, ఆటోలు, కార్లకు హనుమాన్ జెండాలు కట్టుకొని శోభాయాత్ర నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

వీరాంజనేయుని దర్శించుకున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయ స్వామిని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, ఈఓ జన్ను వెంకటేశ్వరరావులు సాదరంగా ఆహ్వానించారు. స్వామి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యేను ప్రధాన అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు ఆశీర్వదించగా, చైర్మన్ శాలువా కప్పి సన్మానించి ప్రసాదం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

108 కలశాలతో అభిషేకం

తిరువూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం 108 కలశాలతో పంచామృతాలు, పళ్లరసాల అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రంగాచార్యులు ఆధ్వర్యంలో మహిళా భక్తులు ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం తిరువూరు బైపాస్‌రోడ్డులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, జగన్నాథపురం అభయాంజనేయస్వామి దేవస్థానం, చీరాల సెంటర్, రాజుపేట ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తారు.

పుస్తకాలు చదవడం అలవరుచుకోవాలి



తిరువూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు



నూజివీడులో విద్యార్థులకు కథలు చెబుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు శేషయ్య

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం చేయించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలు చూడటం కంటే మంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లిలో శనివారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయుడు బీ పుల్లారావు హాజరై విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్రల గురించి వివరించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శాఖ గ్రంథాలయంలో ఆరో రోజు శనివారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరంనిర్వహించారు. నడకుదురు ధర్మాచారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బొమ్మరిల్లు, కథలు, నీతి కథలు చెప్పించారు. గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు కొనసాతుగున్నాయని గ్రంథాలయ అధికారి దీపిక తెలిపారు. చిన్నారులకు యోగా తరగతులు, పేపర్ క్రాఫ్ట్ నేర్పుతున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి పలు రకాల అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

తిరువూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రాంప్రదీప్ పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. సెల్‌ఫోన్లలో సమాచారాన్ని విజ్ఞాన సముపార్జనకు మాత్రమే వినియోగించాలన్నారు. తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

తిరువూరు: విద్యార్థుల్లో నెలకొన్న సృజనాత్మక ఆలోచనలను వెలికితీసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తిరువూరు బార్ అసోసియేషన్ చైర్మన్ సంకురాత్రి జనార్దనరావు అన్నారు. స్థానిక ఐడియాస్ సేవాసంస్థలో 10 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ కార్యక్రమ ముగింపు సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను గుర్తించి తగిన శిక్షణ ఇప్పించాలన్నారు. ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చాట్రాయి: వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో శనివారం విద్యార్థులకు డిక్టేషన్ వ్యాసరచన పోటీలు, గణితం, పుస్తక పఠనం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు



పెనుగొలనులో మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

పెనుగొలను/సత్యాలపాడు(గంపలగూడెం): సహకార సంఘాల బలోపేతంతో రైతాంగానికి మెరుగైన సేవలను అందిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ద్వారా అన్ని రకాల చర్యలను తీసుకుంటుందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న హెచ్‌పీ బంక్ నిర్మాణానికై శంకుస్థాపన, సత్యాలపాడులో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన స్ట్రాంగ్‌రూమ్, క్యాష్ కౌంటర్ ప్రారంభోత్సవం, రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాల్లో ఆయన తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధితో కలిసి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గడచిన రెండు సంవత్సరాల్లో కేడీసీసీ బ్యాంక్ ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సొసైటీల అభివృద్ధికి రూ.50 కోట్లు ఖర్చుచేశామన్నారు. సొసైటీల్లో గోడౌన్, స్ట్రాంగ్‌రూమ్, లాకర్, క్యాష్‌కౌంటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో కంటే లోన్ పరిమితి కూడా ఎక్కువ చేసి రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రైతు అవసరాలకు పెట్రోల్ డీజిల్ సరఫరా చేసేందుకు బంక్‌లను హెచ్‌సీ కంపెనీ ద్వారా ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గం తమ పరిధిలోని రైతులకు మెరుగైన సేవల్ని అందించాలన్నారు. రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకోకుండా సొసైటీలను వినియోగించుకోవలన్నారు. పెనుగొలను, సత్యాలపాడు సొసైటీల అధ్యక్షులు వీ శ్రీనివాసరెడ్డి, బీ రామారావు, ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్, లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ రాణి, సర్పంచ్‌లు ఎస్ లలిత, వీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

19న మెగా జాబ్‌మేళా

తిరువూరు: తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈ నెల 19న మెగా జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణా రాష్ట్రాల పరిధిలోని బహుళ జాతి సంస్థల్లో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలకు ఈ మేళాలో అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు తమ ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 90326 33548, 89199 51682లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జి.కొండూరు: ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు, కుమార్తె రోడ్డుప్రమాదంలో గాయపడిన ఘటన మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. విజయవాడ వైపు నుంచి వాటర్‌ప్యాకెట్ల లోడుతో రెడ్డిగూడెం వెళుతున్న ట్రక్కు ఆటో వెంకటాపురం గ్రామం వద్దకు రాగానే జాతీయ రహదారిపైకి గేదె అడ్డు రావడంతో ఆటో ఢీకొని బోల్తాపడింది. అదే సమయంలో మైలవరం వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న ద్విచక్రవాహనం బోల్తాపడిన ఆటోని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తిరువూరు మండలం జీళ్లకుంటకు చెందిన ముగపర్తి శరత్‌కుమార్ అతని భార్య ముగపర్తి దివ్య, కుమార్తె హరిణికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రోడ్డుభద్రతా పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడకు తరలించారు.

